## హైద్రాబాదునోటు

అది మా అన్నయ్య హైద్రాబాద్ నుండి వచ్చినదినం. మా యింట్లో నా విషయంలో ఖర్చుకి డబ్బడిగితే యివ్వరు. మా అన్నయ్య రాగానే పైసా పట్టుకునే వస్తాడనే ధీమాకొద్దీ ఏదో ఒకనోటు కొట్టు వేద్దామని ప్లాటు వేశాను. కాలంకోసం వేచియున్నా. మా అన్నయ్య భోజనంకోసం గదిలో షర్టు వుంచేసి వెళ్ళాడు. అదే సమయమని ఒక అయిదు రూపాయలునోటు తీసి పేంటుజేబులో ఉంచి బయటపడ్డా. దాంతో బజారుకెళితే ఒక షావుకారన్నాడు 'ఏమయ్యోయ్! చెల్లనినోటు అంటగట్టుదా మనుకున్నావ్? కదులు ముందు!!' అని కసిరేడు. 'చెల్లనినోటా? అని లొక్కున్నాను. నిజం! దానిపై 'గవర్నమెంట్ ఆఫ్ హైద్రాబాద్' అని ముద్ర వుంది. అమ్మ గొప్ప టోపీలో పడ్డానే అని ఇల్లుచేరుకున్నాను.

అదే సమయంలో 'చిన్నవాడూ!! పది రూపాయలకు చిల్లరనోట్లు మార్చుకునిరా!' అన్నాడు నాన్న. నాకు అప్పుడే ఘనమైన ఉపాయం తట్టింది. బజారుకెళ్లి నోట్లు మార్చడం, అందులోని ఒక అయిదు రూపాయల నోటు తీసుకుని ఈ హైద్రాబాద్ అయిదు రూపాయల నోటు మా నాన్నకు అంటగట్టేద్దామని. నాలో నేనే పొంగిపోయాను. చిల్లర మార్చి నాన్నకిచ్చేశా. ఇంక అక్కడుంటే కనుక్కొంటారనే భయంతో నాగది చేరుకున్నా. 'పది! సరిపోయింది!' అన్నారు. మానాన్న చూసుకోలేదుకదా అనే ఉత్సాహంతో జేబులో చెయ్యిపెట్టి కాయితం పైకి తీశాను. ఆశ్చర్యం!! అది హైద్రాబాదు నోటే! నాతెలివి తెల్లవారింది.

బులుసు-ఊ-ప్రకాష్.

## మరుపురాని సీత

సీత రోజూ మాయింటికి ప్రొద్దున్నే పువ్వులు కోసుకుందుకని వచ్చేది. ఆమెను చూస్తుంటే ఎలాంటివాడికైనా మోహించాలనే ఉంటుంది. కాని నాకు మట్టుకు ఆమెను చూస్తుంటే అలాంటి భావం కలగలేదు ఎందుచేతో కాని. ఆమెతో నేను ఎంతో చనువుగా మాట్లాడుతుండేవాడిని.

మా స్నేహితుడు రావ్ నేను కలసి పరీక్షలకోసమని చాలా కష్టపడి చదువుతున్నాం. ఎప్పుడైతే సీతని చూసేడో రావ్ అప్పటిదగ్గరనుంచి ఆమె పువ్వులు కోస్తూవుంటే చూసి గుటకలు మింగుతుండేవాడు. నాతోకూడా ఎప్పుడూ సీత సంగతే చెప్పమని చంపుకు తినేవాడు. అప్పటిదగ్గర్నుంచి వాడు మధురస్మృతుల గురించి, రొమాన్సు గురించి ప్రశ్నలు అడుగుతూ, చదువు వెనకపెట్టేడు. నేను వాడి వాలకమంతా కనిపెట్టి, సీతను చెల్లెలుగా భావించమన్నా. సీత అలాంటిపిల్ల కాదని, భావాల్ని మార్చుకోమని ఎన్నోసార్లు చెప్పేను. కాని వాడు వింటేనా!

మామూలుగానే సీత ఒకరోజువచ్చి పువ్వులు కోసుకుంటున్నాది. నేను అప్పుడు నా అలవాటు ప్రకారం, మా పెరట్లో కసరత్తు చేస్తున్నాను. ఇదే సమయమని రావు గబగబా పూలచెట్టు దగ్గరకెళ్ళి "సీతా నిన్ను చూస్తుంటే ఎలాంటివాడికైనా మోహించాలని ఉంటుంది. నీ అందం ముందర ఏ అప్సరసకూడా పనికిరాదు. నీ తియ్యని ముద్దుకోసమని, నీమధురమయ మాటలు విందామని ఇన్నాళ్లనుంచి కలలు కంటున్నాను. కాని నేడు నాకు అవకాశాన్ని ఇచ్చేవు" అని గుటకలు మింగుతూ ఆమె భుజంమీద చెయ్యివేసేడు. సీత తోకత్రొక్కిన త్రాచుపాములాగ ఉగ్రురాలై, భుజంమీంచి చెయ్యి తోసివేసి, దవడ వాచేటట్లు లెంపకాయకొట్టి గబగబా పూలసజ్జ పట్టుకొని పారిపోయింది. నేను ఇంతట్లో కసరత్తు పూర్తి చేసుకొని వచ్చిచూసేసరికి రావు బిక్కమొహం పెట్టేడు. వాడిని అడిగి సంగతంతా తెలిసికొని చివాట్లు పెట్టేను. అప్పటి దగ్గరనుంచి వాడికి సీతంటే భయం. ఇప్పటికైనా సీత ఎదురుపడ్డాదంటే, పిల్లిలాగ మెల్లిగా జారిపోతాడు బుఱ్ఱవంచుకొని. పి. వీరభద్రస్వామి.

* * *

## పేపరుస్టంట్

చలమయ్య మాకు ఇంగ్లీషుపేపరు తెస్తానని ఇదివరకే చెప్పేడు. వాడు మాకు ఇంగ్లీషు పేపరిచ్చే మాష్టరువద్ద ప్రైవేటుకుడ్తాడు కావడంచేత, వాడు తెచ్చిన పేపరులో ప్రశ్నలే మాపరీక్షలో పడతాయని మేమంతా అనుకొన్నాము. అంచేత మర్నాడు ప్రొద్దున్న పరీక్ష అనగానే ఆర్రాత్రి మేము వాడి రాకకై నిరీక్షిస్తున్నాము.(ఇలాంటివాటిమీద ఆధారపడకపోతే ఒకరాత్రిలో ఏడాదిపాటు చదివిన కోర్సు అంతా చదవడం కష్టం చూడండి!)

మేము ఒక డజనుమంది, అలా వాడికోసం చూస్తూంటే వాడువచ్చాడు. వాగ్దానం ఇచ్చిన ప్రకారం పేపరు తెచ్చాడు. ఇంక మేమంతా చంక లెగరేసుకుంటూ దానికే ప్రిపేరయ్యాము. మర్నాడు ప్రొద్దున్న మావాడు తెచ్చిన పేపరులోది ఒక ప్రశ్నైనా పరీక్షలో లేదు. మా జట్టంతా ఆపేపరు తగలేశాము. ఇవతలకువచ్చి చలమయ్యని మేమంతా తిట్టేము. వాడు ఏడుపు మొహము వేసుకొంటూ, "అయ్యో, మీకిద్దామన్న అసలు పేపరుకాపీ నా బుక్కులో వుండిపోయిందర్రా! దానికి బదులు నా Speculation పేపరు మీ కిచ్చాను కాబోలు!" అని అంటూ "పోనీలెండి, నేను మాత్రం బాగా రాశాను" అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

మేముమాత్రం ఏడవాలో, నవ్వాలో తెలియక స్తబ్ధులమైపోయాము.

స. వి. కృష్ణం.